# పంజరం

"హో య్...హోయ్...హోహోయ్... హోహోయ్..." మొసకొడుతూ పరుగులు తీస్తున్నారు బోయేలు. ఆ పల్లకీ వెనుక పెళ్ళి బట్టల్లో ఉన్న మాధవరావు గుర్రం మీద స్వారీ చేస్తున్నాడు. ఒక్కోసారి గుర్రం గిట్టలు బోయేల కాళ్ళను తాకుతున్నాయి. మరింత వేగంగా పరుగెత్తడానికి ప్రయత్నిస్తున్నారు వాళ్ళు... చొక్కాలు లేని వాళ్ళ శరీరాల నుండి ధారాపాతంగా చెమటలు కారుతున్నాయి. డొక్క లెగిసి పడుతున్నాయి. గుర్రం వెనుక తరుముకొస్తున్నట్టు యాభై అరవై సవారెడ్ల బండ్లు పరుగులు తీస్తున్నాయి. ఆ బండ్ల పరుగుతో లేచిన దుమ్ము మేఘాల్లా ఆవరించుకొనుంది.

ఆ పల్లకిలో కూర్చొనుంది మంజులాదేవి. గాలి కూడా చొరకుండా ఆ పల్లకీ చుట్టూ పరదాలు వేలాడబడుచున్నాయి. చాకలివాళ్ళు వేగంగా ఊపిరిపీల్చుకుంటున్న ధ్వని, పల్లకీ వెనుక గంగా పరిగెత్తుకొస్తున్న సవారు బండ్ల ధ్వని తప్ప బయటేం జరుగుతుందో ఆమెకు తెలియడం లేదు. పల్లకీ పచ్చని పంట పొలాల మధ్య నుంచి వున్న దారి వెంబడి పరుగులు తీస్తూంది. బయటకు చూద్దామన్న కుతూహలాన్నాపుకోలేక పరదా తొలగించి, బయటకు చూడబోయింది మంజులాదేవి.

"అమ్మా!" అరచినట్టంది, అమె కెదురుగా పల్లకీలో కూర్చోనున్న సుజాత. ఆ పిలుపామె కానందాన్నివ్వడానికి బదులు హృదయాన్ని తొలచినట్టయింది. తన ప్రయత్నాన్ని మానుకుంది మంజులాదేవి.

ఇరవై ఏళ్ళయినా లేని తాను పదిహేనేళ్ళ అమ్మాయికి తల్లి! నిన్న పెళ్ళయితే, ఈ రోజు అమ్మయింది తాను.

ఆ అమ్మాయి నెలా సంబోధించాలో తెలియక కొద్ది క్షణాలు తటపటాయించిందామె. నిన్నటి పెళ్ళితో తనకు లభించిన స్థానం జ్ఞాపకం చేసుకుంది. "ఏంటి సుజాతా? ఎందుకంత గట్టిగా పిలిచావు?" అంది.

"అమ్మా! మాది దొరల కుటుంబం. ఇప్పట్నుంచీ నువ్వూ మా కుటుంబంలోని మనిషివే? అంటే దొరసానివన్నమాట. ఈ ప్రాంతానికే పేరుమోసిన పెద్ద దొర మా బాపు. నువ్విప్పుడాయన భార్యవు. నువ్వు నీ పాత అలవాట్లను మానుకోవాలి. మాలో కలిసి పోవాలి. మేం అలగా జనంతో అంతగా మాట్లాడం. దొరసానులు అందర్నీ చూడరు. మనల్నందరూ చూడద్దు. అందుకే దొరసానులు బయటకెళితే మ్యానాలోనో, పల్లకీలోనో, తడకబండి లోనో పోతారు. లోపలికి ఈగ కూడా రాకుండా పరదా లుంటాయి. పెళ్ళి జరిగేటప్పుడో, మరికొన్ని ప్రత్యేక

సందర్భాల్లోనో తప్ప బయటి వాళ్ళు మనల్ని చూడరు. చీటికి మాటికీ అలగాజనం కండ్ల పడొద్దు మనం. అందుకే నువ్వు నీ పాత బుద్ధుల్ని మానుకోవాలి. నువ్విప్పుడు చింతలవారి అమ్మాయివి కావు. రాచభక్తుల వారి కోడలివి. నిన్నటివరకూ నువ్వు పదెకరాల భూమి కూడా లేని కిషన్‌రావు బిడ్డవు. ఈ రోజు నుంచి పెద్ద జమీందారు మాధవరావు భార్యవు."

అన్ని విషయాలూ అరిందాలా చెప్పిన సుజాత దిక్కు ఆశ్చర్యపోతూ చూసింది మంజులాదేవి.

అవునూ! తానిప్పుడు పెద్ద జమీందారు భార్య. నలభై ఐదేళ్లు దాటిన దొరగారి భార్య. ఇరవై ఏళ్ళయినా నిండక ముందే నలుగురు కూతుళ్ళకూ, తనంత వయసున్న కొడుక్కూ తల్లి. పెళ్ళయీ కాకముందే ఐదుగురు పిల్లలకు తల్లయిన తానెంత అదృష్టవంతురాలు? ఒక్క క్షణంలో ఆమెలో ఎన్నో ఆలోచనలు.

సుజాత మాట లకంగీకార సూచకంగా తలూపింది మంజులాదేవి. కొంచెమాగి "సుజాతా! పెళ్ళి పల్లకీలో పెళ్ళయిన భార్యాభర్తలు కూర్చుంటారు కదా! మరి నువ్వు కూర్చున్నావెందుకు?" అని ప్రశ్నించింది.

'ఇలాంటి ప్రశ్నలు తమ కుటుంబంలోని ఆడవాళ్ళడగరు. మగవాళ్ళేది చెబితే అది చేయడమే. మంజులాదేవి బీద కుటుంబంలోంచి వచ్చింది కదా!' తనలో తాననుకుంది సుజాత.

"బాపుకిది రెండో పెళ్ళాయె. ఈ వయసులో పల్లకిలో కూర్చొని పోవడం బాగుండదని గుర్రంపై పోతున్నాడు. ఈ ప్రాంతం మొత్తంలో మా బాపుకొక్కనికే గుర్రముంది."

"అలాగా..." అని ఊర్కుంది మంజులాదేవి. కళ్ళు మూసుకొని మౌనంగా కూర్చుంది.

తానూ సాంప్రదాయం జీర్ణించుకున్న వెలమ కుటుంబంలోనే పుట్టింది. తమకు పెద్దగా ఆస్తిపాస్తులు లేకున్నా నాన్నను, అన్నయ్యలను చాలామంది ఊరివాళ్ళు దొరలనే పిలుస్తారు. అయితే, 'బొక్కలు కంకే బక్క నర్సయ్యగూడా దొరే. నాగలి దున్నుకుంటూ బతికేటోల్లను గూడా దొరని పిల్సుడే' అని తన నాన్న నర్సింగరావును గూర్చి ఊరివాళ్ళనుకోవడం తానెన్నోసార్లు విన్నది. తన తండ్రికి దొరతనం చేయాలని లేకున్నా, అన్నయ్యల కుండేది. అయితే, పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోవడంవల్ల వాళ్ళమాటలు సాగడం లేదు. బాగా భూములున్న తమ కులంవాళ్ళే తమ నాన్నను చులకనగా చూసేవారు. తమ కుటుంబంలోని స్త్రీలు కూడా శ్రామిక కుటుంబాల్లోని స్త్రీలలా బయట తిరుగరు. కాని, జమీందారు కుటుంబాల్లోలా ఘోషా లాంటిది లేదు. అప్పుడప్పుడు మొక్కజొన్న చేల్లోకి, పొలాల దిక్కూ తాను, అమ్మ పోతుండేవాళ్ళు.

'దొరసానచ్చింది. చిన్న దొర్సానచ్చిం దనేవాళ్ళు'.'ఈ దొర్సాని పెండ్లెట్ల చేస్తడో బక్క నర్సయ్య దొర' అని సానుభూతి చూపేవాళ్ళు.

మంజులాదేవికి మంచి సంబంధం తేవాలన్న తపనతో కాళ్ళరిగేలా తిరుగుతున్నాడు

నర్సింగరావు. కాని, అతని ఆర్థిక పరిస్థితి అత నాశిస్తున్న సంబంధం తేవడానికి సహకరించడం లేదు.

"నా బిడ్డ బంగారి తునకోలుంది. తక్కువ కట్నాని కొప్పుకుంటారు..." అనేవాడు నర్సింగరావు. కాని, అతని ఆశ అడియాసే అయింది.

"అందమేమన్న కొరుక్కు తినేదా? నలుసుక తినేదా? నీ బంగారి తునుకను నీ దగ్గరే ఉంచుకో. గంతకు తగ్గ బొంతని చూసుకో. నీ పరిస్థితికి ఒంటినాగ లెవుసం చేసేవాడో, పాలేరుతనంతోని బతికేవాడో తప్ప జమీందారు దొరుకుతాడా మన కులంలో?" అని నర్సింగరావును ఎగతాళి చేసా రతనికులంవాళ్ళు.

మంచి సంబంధం పేరుమీద తిరిగి తిరిగి అలసిపోయాడు నర్సింగరావు. ఇక తన శక్తికి తగిన సంబంధం చూసి పెళ్ళి చేద్దామన్న ప్రయత్నంలో ఉన్నాడు.

ఇంతలో మాధవరావు దగ్గర పనిచేసే కరణం పంతులొచ్చాడు వాళ్ళింటికి. కాళ్ళు చేతులు కడుక్కొని మంచంలో కూర్చున్నాడు. వాళ్ళిచ్చిన మజ్జిగని తాగాడు. ఉపోద్ఘాతంమేం లేకుండానే–

"మా దొర మాధవరావు మీకు తెలుసు కదా! వందల ఎకరాల భూమున్న జమీందా రాయన. ఆ దొర కన్ను మీ మీద పడ్డదంటే, అది మీ అదృష్టమే. మీ అమ్మాయి దొరింట్లో పడటం మీ అమ్మాయదృష్టమే..." అన్నాడు పంతులు.

ఆ మాటలు విని ఉబ్బి తబ్బిబ్బయ్యాడు నర్సింగరావు. అతని సంతోషానికంతే లేదు. మాధవరావు దొర తన కూతుర్ని తన ఇంటి కోడలుగా చేసుకుంటానని తనే మనిషిని పంపడం ఎంతదృష్టం? నర్సింగరావు భార్య ఆనందానికయితే అవధులే లేవు. చిన్న వ్యవసాయం చేసుకుంటూ బతికే తాము ఇంత గొప్ప అదృష్టం కలసివస్తుంటే, ఎలా కాదనగలరు? ఆ భార్యా భర్తలిద్దరూ ఆశ్చర్యంనుంచి తేరుకునేసరికి ఐదు నిముషాలపైన్నే పట్టింది. అయితే, దొరకొడుకు తన కూతురుకంటే ఒకటి రెండు నెలలు చిన్నవాడు కావడం జ్ఞాపకం వచ్చింది నర్సింగరావుకు. ఆమె అందం గూర్చి తెలుసుకొని నిశ్చయించుకున్నా డనుకున్నాడతను.

"పంతులూ...! దొరింట్లో నా బిడ్డ పడటంకంటే అదృష్టమేముంది? నా బిడ్డ బంగారు తునుకోలుంది. దాని చెయ్యిచూసిన వాళ్ళంతా జమీందారింట్లో పడుతుందనే చెబుతున్నారు. అదే ఇప్పుడు నిజం కాబోతుంది. కాని, దొర కొడుకు వయసూ, నా బిడ్డవయసు దాదాపొక్కంతే. మగపిల్లవాడు కొంచెమన్నా ఎక్కువ వయసుంటే మంచిదేమో! తర్వాత చెప్పలేదంటారని చెబుతున్నాను. మీరే ఇష్టపడితే మేం చేసేదేం లేదు. మా అదృష్టమనుకుంటాం." నర్సింగరావు మాటలు విని ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టడం ఇప్పుడు పంతులు వంతయింది. మంచంలో సర్దుకొని కూచుంటూ–

"మీరంటున్నదేంటో నాకర్థం కావడం లేదు. దొర కొడుక్కేంది? నీ బిడ్డ నిచ్చుడేంది? దొర కొడుక్కు పిల్లలు దొరకక నీ దగ్గరి కొచ్చిన్ననుకుంటున్నావా? 'కో' అంటే కోటిమంది వరుసలో నిల్సొనున్నరు. నువ్వు వందల కట్నం గూడియ్యలేవు. అయినెకు వెయిలు పోసి పిల్లనిచ్చుటానికున్నరు. దొర కొడుక్కయితే నీ బిడ్డే

కావాలా? నువ్వాతనితో ఎందులో సరితూగుతావని అలా ఆలోచిస్తున్నావు? నేను మీ అమ్మాయి నడుగుతున్నది మాధవరావు దొరకు. ఆర్నెలల కింద దొర భార్య చనిపోయింది. మీకు తెలుసుకదా! యాభయన్న లేవాయె దొర వయసు. ఎన్ని రోజులుంటాడు ఒంటరిగా? దొర కోసం మీ అమ్మాయి నడుగుటానికొచ్చిన. దొరే పంపించాడు" అన్నాడు పంతులు.

కొద్ది క్షణాల వరకు పంతులు మాటలు మింగుడు పడలేదు నర్సింగ రావుకు. దొర పంపిన ఉద్దేశ్యమర్థమయ్యే సరికేమనాలో తోచలేదాతనికి. బలవంతునితో విరోధం పెట్టుకుంటే నష్టపోయేదెవరో అతనికి బాగా తెలుసు.

"అంటే, నా బిడ్డను దొర కొడుక్కు కాక దొరకియ్యాలా? రాండో పెళ్ళి కొడుక్కిచ్చుటానికి దానికేమన్న కాలు వంకరా? చేయి వంకరా? అదేమన్న వయసు మీరుందా?" అన్నాడు నర్సింగరావు.

"ఏవీ వంకర లేవన్న మాట నిజమే? ఆమెకే లోపమూ లేదు. కాని, అడుగుతున్నది ఈ ప్రాంతానికే మకుటంలేని మహారాజులాంటి వాడైన మాధవరావు దొర! అంత దొరలాంటి వాడే స్వయంగా మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటే, కాదంటారా? దీన్నే కడప దగ్గరి కొచ్చిన అదృష్టాన్ని కాలరాయడమంటారు. దొరకు రాండో పెళ్లయితే మాత్రం మీకొస్తున్న నష్టమేంటి? అంత గొడితే, దొరకు నలభై ఐదేళ్ళు కూడా లేవు. మంచి ఆరోగ్యంగా ఉన్నాడు. ఒక్క వయసులో కొంత ఎక్కువ తక్కువని తప్పితే, నీ సంసారమంతా కొట్టినా ఆ దొర కాలిగోటికి సరిపోతుందా? నువ్వెంత ప్రయత్నించినా ఇంతకంటే మంచి సంబంధం తేగలవా?

"ఐదారేళ్ళ క్రితం నిజాం పాలన పొయ్యేవరకు ఈ ప్రాంతలో నిజాంకు కుడిభుజమోలుండె దొర. నిజాం మనుషులెవ్వరొచ్చినా దొరింటికే వచ్చేవాళ్ళు. రెండు మూడేండ్లు కమ్యూనిస్టుల భయానికి ఊరిడిసిపోయినప్పుడు తప్ప దొర అధికారాలకు అడ్డున్నదా? ఇప్పటికీ దొర మాట కెదురున్నదా? లక్షల ఆస్తి అధికారం అన్నీ ఉన్నా, దొరే పిల్లనడుగుతే సంకోచించేవాన్ని నిన్నే చూసిన..." అంటున్న పంతులు మాటలు పూర్తికాకుండానే-

"మా చెప్పినవు తియ్యి! పెండ్లి కెదిగిన కొడుకు నింట్లో పెట్టుకొని, ఎంత దొరయితే మాత్రం పెండ్లి చేసుకోవడమెందుకు? ఇదేం పోయే కాలం?" అంది నర్సింగరావు భార్య, స్త్రీ సహజమైన అక్కసుతో.

"ఆ దొర పేరు చెబితేనే ఈ చుట్టుప్రక్కల గ్రామాలకు హడల్ ఆయన నొక్క మాటని బతికిన వాళ్ళు లేరు. మీ అమ్మాయి కాకుంటే అంతకంటే అన్ని విధాలా మెరుగైన సంబంధం నిమిషాల్లో దొరుకుతుంది. దొర ఇంట్లో అడుగుపెట్టడానికి కూడా అర్హత లేని మీకు, ఈ సంబంధం తక్కువనిపిస్తుంది. 'సిరి రా మోకాలొడ్డటమంటారే' అలా ఉంది మీ సంగతి. సరే, మీ అమ్మాయి మీ ఇష్టం. మీరామె పెండ్లి కోసం ఎన్ని చెప్పులరిగేలా తిరుగుతున్నారో రెండూళ్ళవతల మాత్రమే ఉన్న దొరకు తెలువదనుకోకు. ఎర్రగా, బుర్రగా ఉన్నంత మాత్రాన మీ స్థితికి మంచి సంబంధమెలా వస్తుంది? గంతకు దగ్గ బొంతని ఏ పాలేరోని

లాంటి వానికిచ్చి పెళ్లి చేస్తరో, లక్షల ఆస్తికి జమీందారిణిగా చేస్తారో, మీ ఇష్టం. దొర అనుగ్రహం మీ మీద పడితే, మీ స్థితి కొంతైనా బాగుపడుతుంది. నేను మీ మంచి కోరే చెబుతున్నాను. ఏ విధంగా చూసినా మీ బిడ్డ దొర భార్య కావడం అదృష్టమే. బాగా ఆలోచించుకోండి. ఏం నిర్ణయించుకుంటారో, ఈ రెండు రోజుల్లో నిర్ణయించుకోండి. నేను ఎల్లుండి మళ్ళీ వస్తాను" అని వాళ్ళు మాట్లాడటానికి కూడా అవకాశమివ్వకుండా లేచి నిల్చున్నాడు పంతులు. బయట విడిచిన సవారెడ్ల బండి కట్టించుకొని వెళ్ళిపోయాడు.

ఈ రెండు రోజులూ ఇంట్లో చాలా వాదోపవాదాలు జరిగాయి. నర్సింగరావు, అతని కొడుకు లిద్దరూ దొరకి మంజులాదేవి నివ్వడానికే మొగ్గు చూపారు. అతని భార్య మొదట్లో కొంత వ్యతిరేకించినా, అన్నీ ఆలోచించి ఒప్పుకుంది. అన్ని ఆస్తిపాస్తులూ అధికారాలున్న జమీందారు భార్యగా మంజులాదేవి పోబోవడం తమ కుటుంబం చేసుకున్న అదృష్టంగానూ, ఆ అమ్మాయి అదృష్టంగానూ భావించారు. అంత దొరే చేసుకుంటానంటే, కాదనడం మూర్ఖత్వం అనుకున్నారు. మంజులాదేవిని ఒక్క మాట కూడా అడగకుండానే నిర్ణయించుకున్నారు.

'అంత వయసువాడితో పెళ్ళా?' అన్నకూతురుకు రకరకాలుగా నచ్చజెప్పారు. "ముప్ప యారేండ్ల పడుచోనికి మూడేండ్ల పిల్లనిచ్చి చేస్తారనేవారు ముందు. ఇదేం పెద్ద చోద్యం కాదు. మన ఇండ్లలో భార్య చనిపోతే, అరవై ఏండ్ల వయసులో కూడా పెళ్ళి చేసుకున్న వాళ్ళున్నారు. దొరింట్లోకి అడుగుపెట్టే అర్హత కూడా లేదు మనకు. నువ్వు నోచుక పుట్టావు కనుకనే, అంత పెద్ద జమీందారుకు భార్యవు కాబోతున్నావు. ఈ సంబంధం వల్ల మన కుటుంబమూ కొంత బాగుపడ్తుంది" అన్న తండ్రి మాటలు విని, మౌనంగా ఉంది మంజులాదేవి.

ఇంకో గంటయితే కరణం పంతులు వచ్చే సమయం. అప్పుడు "కనీసం ఒక్కసారి ఆయనను చూసింతర్వాత చెబుతాను" అంది.

"ఆ మాట మనమంటే విరుచుక పడతారు. అయినా మగవాన్ని చూసేదేముంది? మగవాడి విషయంలో చూడాల్సింది – పోషించగలడా – లేదా అన్నదే కాని, ఎలా ఉన్నాడని కాదు. దొరే ఇష్టపడి చేసుకుంటానన్న తర్వాత, మనం చూడాలనడం ఏం బాగుంటుంది?" అన్నారు మంజులాదేవి అన్నలు.

మాధవరావు ఆస్తిపాస్తులూ, అధికారాల ముందు వయస్సు భేదం వాళ్ళెవరికీ అభ్యంతరమనిపించలేదు.

మంజులాదేవికి కూడా తెలిసిన జీవితం తక్కువే.

పంతులు వస్తూనే నర్సింగరావు కుటుంబ సభ్యుల ముఖాలను చూసి విషయాన్నర్థం చేసుకున్నాడు.

"ఖర్చులు దొర వైభవానికి తగ్గట్టుగా పెట్టడానికి మేం సరిపోము. ఏం విషయంలోనూ మేమాతనితో తూగం, దొరతో నోసారి మాట్లాడాలి" అన్నాడు నర్సింగరావు.

"దొర ఇక్కడికి రావడం కుదురది. మీరే వచ్చి ఏం మాట్లాడుతారో

మాట్లాడండి. కట్నంగా మీరేం ఇవ్వాల్సిన పనిలేదు. పెళ్ళి చేసివ్వండి చాలు. పెళ్ళి మాత్రం వైభవంగా జరగాలి. మీరు భరించలేకపోతే, ఖర్చుల కిందికి కూడా దొర డబ్బిస్తానన్నాడు."

పంతులు మాటలకు 'సరే' నన్నాడు నర్సింగరావు.

'వారం రోజుల్లో రండి. పెళ్ళవీ పెట్టుకుందాం' అని భోజనం చేసి, వెళ్ళిపోయాడు పంతులు.

విషయం తెలుసుకున్న మంజులాదేవి స్నేహితురాండ్రామె దగ్గరికొచ్చారు.

"నువ్వెందు కొప్పుకున్నావీ పెండ్లికి? ఆ దొరను నేను చూసానో పెండ్లిలో ముసలి మొగుడికి పడుచు పెళ్ళామున్నట్టిదేం పెండ్లి వద్దను."

"అతనితో నీ పెండ్లి కాకిముక్కుకు దొండ పండులాగే ఉంటుంది. దొరట దొర. ఒక్కపూట తిన్నా చాలు కాని, ఈడు జోడున్న జంటయితే బాగుంటుంది!"

"అబ్బో! నువ్వు పెద్ద దొర్సానివై పోతున్నావుగద. బాగ సుఖపడు. మా లాంటి వాళ్ళు నీ కండ్లకానుతారా?"

ఆమెను రకరకాలుగా దెప్పారు. ఒకరిద్దరామెను సమర్థించారు కూడా. ఎవరికేం జవాబు చెప్పకుండా మౌనం వహించింది మంజులాదేవి.

"దొరింట్లో పడటమంటే మాటలా? దేనికైనా పెట్టి పుట్టాలె. మంజులాదేవి అదృష్టవంతురాలు."

"ఆమెది మహారాణి జాతకమని చిన్నప్పట్నుంచీ తెలుసు" అన్నారు మంజులాదేవి బంధువుల్లో కొందరు.

పెళ్ళి పీటల మీద కూర్చునే వరకూ కాబోయే భర్తను చూడలేదు మంజులాదేవి. చూసిం తర్వాత ఆమె వణికిపోయింది.

పిడికెడు పిడికెడు మీసాలతో, పెద్ద తలతో, భారీ ఆకారంతో ఉన్న మాధవరావు ఆమెకు భయంకరంగా కనిపించాడు.

'నాకా దొర తెలుసు. వయసు యాభైకి దగ్గరుంటయేమొ. కుందనపు బొమ్మ సోంటిబిడ్డ నయినెకెందుకిస్తున్నరు? అతనెన్ని రోజులు బతుకుతాడు? అప్పుడామె బతుకేమై పోవాలి?' అన్న మేనమామ పది రోజుల క్రితమన్న మాటలు జ్ఞాపకం వచ్చాయామెకు. అయినా, మౌనమే వహించిందామె.

యాభై సవారెడ్ల బండ్లలో తరలి వచ్చారు జనం. మూడు రోజుల పెళ్ళిని రెండు రోజులకు కుదించారు.

"ఇంకా ఊరంతా తరలి వచ్చేదుండె. ఏదో రెండవ పెళ్ళని తక్కువ మందొచ్చారు. ఇంకా బాగా జనమొత్తే నర్సింగరావు భరించలేడని కూడా తక్కువ మందిని తీసుకొచ్చారు" అనుకున్న మాటలూ విన్నది మంజులాదేవి.

పెళ్ళి వైభవంగానే జరిగింది.

నర్సింగరావు తన కూతురు కివ్వదలుచుకున్న కట్నం, ఇతర లాంఛనాలు, పెళ్ళికి చేస్తాననుకున్న ఖర్చంతా ఇంటిముందు పెళ్ళి చేయడానికే సరిపోయింది. ఖర్చుల

కిందికి డబ్బులడుగుదామనుకొని చులకనవుతానని ఊర్కున్నాడు నర్సింగరావు.

తన ఎడ్ల కోసమని ఉంచుకున్న ఏడాదికయ్యే గడ్డి రెండు రోజుల్లో ఖర్చయిపోయింది.

"బీదోడైనా నర్సింగరావు దొర మాధవరావు దొర హోదాకు తగ్గట్టు లగ్గం జేసిండు. ముప్పై యాటలు తెగె, మాటలా?"

"నగలు, బట్టలు - మిగతా ఖర్చులన్నీ మాధవరావు దొరే పెట్టుకున్నాడు" జనం అనుకున్న మాటలూ వింది మంజులాదేవి.

మిగతా కార్యక్రమాలన్నీ దొరల హోదాకు తగ్గట్టుగానే జరిగాయి. అప్పగింతల సమయంలో అంతా కన్నీళ్ళు తీసుకున్నారు.

☆ ☆ ☆

"అమ్మా! ఏదో ఆలోచిస్తున్నట్టున్నావు. మన ఊరు దగ్గరకొస్తుంది" అన్న సుజాత మాటలతో కళ్ళు తెరిచింది మంజులాదేవి.

పల్లకీ మోస్తున్న బోయీలు తీస్తున్న లయబద్ధమైన శ్వాస, సవారెడ్ల మెడల్లోని గంటల ధ్వని వినబడ్తున్నాయామెకు.

"ఏం లేదు సుజాతా! మూత్రానికొస్తుంది."

మంజులాదేవి మాట తప్పన్నట్టుగా నోటి మీద చెయ్యేసుకుంది సుజాత. "అమ్మా! ఆ మాటనకు. ఈ అడవిలో ఇంత మందిలో మనలాంటి వాళ్ళకది సాధ్యం కాదు. చప్పుడు చెయ్యకుండా కూర్చో."

కొద్దిసేపిద్దరూ మౌనంగానే కూర్చున్నారు.

"అమ్మా! మొన్న మొన్నటిదాకా మన రాష్ట్రాన్ని నైజామేలిండటగద! నేను చిన్న పిల్లగున్నప్పుడు వాళ్ళ మనుషులు మా ఇంటికొచ్చేది. మా బాపుకు వాళ్ళొస్తే పండుగే. ఇంట్ల కోళ్ళు, గొర్లు మస్తు తెగేవి. మా బాపుకు నైజాం కాలం నుంచే గుర్ర మున్నది."

ఇంటి వైభవం గూర్చి, తండ్రి గూర్చి, ఆస్తిపాస్తుల గూర్చి చెబుతుంది సుజాత.

"సుజాతా! మీ భూమి లెక్కడున్నాయో నీకు తెలుసా?"

"నాకేం తెలుసు? మా అమ్మకే తెలువక పొయ్యేది. మేమక్కడి కెందుకు పోతం? ఆడోల్ల కక్కడేం పని? ఒక్క మక్క పెరడి, తోట మాత్రం తెలుసు. నాకు పెరటి దగ్గరికి పోయినా, తడుక బండ్లోనే పోయేవాళ్ళం. నేనో మూడు నాలుగుసార్లు పోయిన."

పల్లకి ఆగింది. దింపి నేలపై పెట్టారు. బండ్లన్నీ ఎక్కడియక్కడాగి పోయాయి. బ్యాండు మేళం మోగుతుంది. జనమంతా పల్లకి చుట్టూ గుమిగూడారు. అప్పుడు పల్లకికున్న పరదా తొలగించారు. తల వంచుకొని కూర్చొనుంది మంజులాదేవి.

మెరుపుతీగలా ఉన్న మంజులాదేవిని కన్నార్పకుండా చూస్తున్నారు జనం.

"పసిపిల్ల! ఇరువయేండ్లన్న ఉంటయో, ఉండయో బిడ్డకు. బిడ్డగొంతు కోసింద్రు గిట్లుంటదా?"

"ఎవరన్నా వింటే మన కర్మ పలుగుతది. చెట్టుకు కట్టేసి కొడుతడు దొర. ఏం మాట్లాడకండ్రి, పైసతోని భాగోతం."

"దొరకున్న పైసం జూసి భమిసి ఇచ్చినట్టున్నారు. గోడలకు చెవులుంటాయి. చప్పుడు జెయ్యకుండ్రి."

ఊళ్ళోంచి పెళ్ళి ఊరేగింపు పోతుంటే రకరకాలుగా అనుకుంటున్నారు జనాలు. దొరకు వ్యతిరేకంగా మాట్లాడటానికి జంకుతున్నారు.

తుపాకి మందు పేలుస్తున్నారు. కొందరు ఊరేగింపు ముందు డాన్సు చేస్తున్నారు.

సవారెడ్ల బండ్లు ఎవరింటికి వాళ్ళు తీసుకెళ్లారు. ఎడ్లను కొట్టంలో కట్టేసి వచ్చి, పెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నారు వాళ్ళు. పెళ్ళి ఊరేగింపు దొర ఇల్లు చేరుకునే సరికి రెండు గంటలపైనే పట్టింది. ఆ రెండు గంటలూ ఊరంతా సందడే.

ఊరేగింపు ఇంటి ముందాగింది.

మాధవరావు ప్రక్కన నిల్చున్న మంజులాదేవి సింహం ప్రక్కన జింక పిల్ల నిల్చున్నట్టుగా అనిపించింది చూస్తున్నవాళ్ళకు.

ఇంటి సింహద్వారాన్ని చూసిన మంజులాదేవికి కళ్ళు తిరిగినంత పనయింది. "ఒక్కొక్కటి దూలమంతున్న దర్వాజ కట్టెలు. విశాలమైన తలుపులు. వాటిమీద చెక్కిన చెక్కడాలు. ఆ తలుపులు, దర్వాజ ఖరీదు తమ ఇల్లు ఖరీదుకు సరిపోతుందేమో!" ననుకుంది మంజులాదేవి.

కుడికాలు లోపలికి పెడుతూ, ఇంట్లోకి ప్రవేశించింది. ఆ దర్వాజకు పక్కనే బయట పెద్ద కచ్చేరిల్లు ఉండటం గమనించింది.

మంగళ హారతులతో లోపలికి తీసుకెళ్ళారామెను.

పెద్ద దరువాజ దాటి ఇంట్లోకి పోతూనే, ఎడమ దిక్కున్న ఇంట్లో పెద్ద పెద్ద గుమ్మాలు, గరిసెలు... ఏడెనిమిది పుట్ల ధాన్యాన్ని నిలువ చేసుకునేట్టున్నాయవి.

గుమ్మాల ప్రక్కన రకరకాల వ్యవసాయపు పనిముట్లు. కుడిదిక్కు మూడిళ్ళ భవంతిలో మరో ఇల్లు. గోడల నిండా ఫోటోలు, నాలుగైదు పట్టె మంచాలు. కుర్చీలు, కట్టె టేబుల్లు. ఆ రెండిల్లను కలుపుతూ దర్వాజ కెదురుగా విశాలమైన ఇల్లు. రెండు మూలలకు రెండు గదులు. దాని వెనుక మరో ఇల్లు. దాని ప్రక్కనే ఓ సామాన్య కుటుంబం మొత్తానికి సరిపోయే ఇల్లంతున్న వంటిల్లు. వంటింట్లో రకరకాల సామాను. కచ్చేరింటి పక్కన రెండు గదుల డాబా. ఇంటికి ఈశాన్య మూలన బావి, బాదం చెట్టు, స్నానాల గదులు. మట్టి గోడలతో పెట్టిన పాయఖానాలు. ప్రహరీ గోడవతల విశాలమైన స్థలం.

ఇంట్లోకి ప్రవేశించిన గంటలోనే ఇల్లును చూసి ఇంటి వైభవాన్నర్థం చేసుకుంది మంజులాదేవి. ఇంటి నిండా జనం. ఎవరి పనుల్లో వాళ్ళు.

తెల్లవారి ఊరందరికీ వైభవంగా విందు జరిగింది. పదహారో రోజున నల్లపూసలు కుచ్చే కార్యక్రమం. మిగతా కార్యక్రమాలన్నీ దొరల హోదాకేమాత్రం తగ్గకుండా జరిగాయి.

ఈ మధ్య కొత్త దొరసానిని చూడటానికెంతో మంది వచ్చి పోయారు. పడక గదిలో మొదటి రోజున మంజులాదేవి ప్రక్కన కూర్చొని మాధవరావు "ఇది గడి. దొరల గడంటారు దీన్ని. వంశపారంపర్యంగా లభించిన ఆస్తి ఇది. మేం దొరలం. ఇప్పుడు నువ్వే ఇంటికి యజమానురాలివి. దొరల కుటుంబంలో కొన్ని నియమాలు, కట్టుబాట్లున్నాయి. మా కుటుంబంలో స్త్రీలు బయట కెళ్ళడం తక్కువ. ఎవరితో పడితే వారితో మాట్లాడటం తక్కువ. పెళ్ళి పనులవీ ఉంటాయి కాబట్టి జనాలు లోపలికొచ్చారు కాని, మనింట్లో పనిచేసేవాళ్ళు, ఇంకొందరు తప్ప ఇంటి లోపలికి వచ్చేవాళ్ళు చాలా తక్కువ. ఈ గడిలోని ఏ ఒక్క రహస్యమూ బయట పడకూడదు. నా వయసు కొంతెక్కువే. అట్లని ఈ కుటుంబ గౌరవానికి భంగం కల్గించే ఏ పని నువ్వు చేసినా, నీతోపాటు, నీ కుటుంబమూ సర్వనాశనమవుతుంది. నౌకర్లు, చాకర్లు, ధనం-ధాన్యం-అధికారం- నగలు కావాల్సింటే, మీ తల్లి గారికి కొంత సాయం చేసుకున్నా కాదనను. కాని, నాకే విధంగా కోపం తెప్పించకుండా మెదులుకో. ఇంటి గౌరవం కాపాడు. నువ్వేదో గొప్ప అందగత్తెవని నిన్ను పెళ్ళి చేసుకోలేదు. పేద కుటుంబంలోంచి వచ్చిందయితే కృతజ్ఞతగా పడి వుంటుందని చేసుకున్నాను" అన్నాడు.

అన్నిటికీ తలూపింది మంజులాదేవి.

"నా కొడుకు వయస్సు ఇరవై. నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవడం వానికిష్టం లేదు. వాడి అయిష్టాన్ని నువ్వు గమనించే ఉంటావు. వాన్ని మెల్లమెల్లగా మార్చడానికి ప్రయత్నించు. నిన్ను 'అమ్మా' అని పిలిచేట్టు చేసుకో."

ఆమెపై మరింత భారాన్ని మోపాడు మాధవరావు.

ఇంటి పరిస్థితులనన్నిటినీ అర్థం చేసుకుంది మంజులాదేవి. వయస్సుకు మించిన పెద్దరికాన్ని అలవరుచకోవడానికి ప్రయత్నించింది.

సుధాకర్‌రావు మంజులాదేవి నదోలా చూస్తున్నాడు. మంజులాదేవి మాత్రం 'బాబూ' అనే పిలుస్తుంది. మొదట్లో ఆమెను కోపంగా చూసిన సుధాకర్‌రావు ఇప్పుడు 'చిన్నమ్మా' అని పిలుస్తున్నాడు. ఓ రోజతన్ని ఎదురుగా కూర్చోబెట్టుకొని-

"బాబూ! నా ప్రమేయం లేకుండానే ఈ పెళ్ళిజరగి పోయింది. పరిస్థితులకు తలొగ్గి, తల్లిదండ్రుల మాటకు తలొగ్గానే గాని, ఇందులో నాకు వేరే ఆలోచనేం లేదు. నావల్ల మీ కుటుంబాని కెలాంటి హానీ జరుగదు. నన్ను మీ కుటుంబంలో సభ్యురాలిగా ఉండనీయండి" అంది.

ఈ తర్వాత సుధాకర్‌రావు ప్రవర్తనలో మార్పు వచ్చింది.

గ్రామ రాజకీయాల్లో, భూముల గొడవల్లో ఎప్పుడూ తలమునకలై ఉంటున్నాడు మాధవరావు. భర్త ప్రక్కనుంటే చిగురుటాకులా ముడుచుకు పోయేది మంజులాదేవి. వాళ్ళెప్పుడూ మనసు విప్పి మాట్లాడుకున్నది లేదు. ఆమె మాట్లాడటానికి బదులు వినడానికేలవాటు చేసుకుంది.

మంజులాదేవి అందం, వాళ్ళ మధ్యనున్న వయోభేదం మాధవరావును మరింత కఠినంగా ఉండేట్టు చేసాయి.

మంజులాదేవి మేనమామ వచ్చి పోయిం తర్వాత, కోపానికొచ్చాడు మాధవరావు. "ఎవడెవడో అలగా ముండా కొడుకులు రావద్దు ఘనింటికి. మీ అమ్మా, నాన్న, మీ అన్నయ్యలు, నీ దగ్గరి వాళ్ళంటే సరే. ఎవడ డితే వాడు రావడం దేనికి? వాడికి నీతో ఏం పని?" అని అరిచాడు.

మంజులాదేవేం మాట్లాడలేదు.

పెళ్ళయి ఆర్నెల్లయింది. ఒక్కసారి కూడా బయటకెళ్ళలేదు.

"ఓ సారి మన చేండ్లు, పొలాలు చూసొద్దాం" అంది. మాధవరావు కనుబొమలు ముడిపడ్డాయి.

"ఆడవాళ్ళకివన్నీ ఎందుకు? ఏ భూమి ఎక్కడుందో, అసలు మన కెంత భూముందో మీ అక్క కసలే తెలిసేది కాదు. ఆమె ఒక్కసారి కూడా అడుగలేదు. అవన్నీ నేను, సుధాకర్ చూసుకుంటాం. నీకీ ఆలోచ నెందుకొచ్చింది? నేను పోతే వాటిమీద అధికారం నడిపించాలనుకుంటున్నావా? అదేం కుదురదు." భర్త మాటల్లోని అర్థం గ్రహించి తనలో తానే ఏడ్చింది. ఇంకెప్పుడూ భూముల మాటెత్త కూడదని నిర్ణయించుకుంది.

అంటే, ఆ ఇంట్లో తన స్థానమేంటి? దొరల కుటుంబాల్లో దొరసానులుగా పిలువబడే స్త్రీల స్థానమేంటి?

ఆ ప్రశ్నలకు జవాబులే దొరుకలేదామెకు.

ఓరోజామెను సవారెడ్ల బండ్లో వెనుక ముందు పరదా కట్టి, మొక్క జొన్న చేల్లోకి తీసుకుపోయాడు సుధాకర్‌రావు.

"చిన్నమ్మా! ఇక్కన్నుంచి కనిపించేదంతా మన పెరడే. దాదాపిరవై ఎకరాలు ఒకే చోటుంది." ఇతర భూముల గూర్చి చెప్పాడు.

ఆ చేనంతటికీ కలిసో పెద్ద బావుంది. ఆ బావికి నాలుగు మోటలున్నాయి. కొద్ది సేపక్కడుండి తిరిగొచ్చింది మంజులాదేవి.

ఆమెను తల్లిగారింటికి పంపించేవాడు కాదు మాధవరావు. పంపించినా మేనాలో బోయేలతో పంపేవాడు. ఒకటి రెండు రోజులకంటెక్కువ ఉండనిచ్చేవాడు కాదు.

తన హోదాకు తగ్గ జమీందారు సంబంధాన్ని సుధాకర్ రావుకు చూసాడు తండ్రి. ఇంకో రెండు నెలల్లో పెళ్ళి.

నగల పెట్టె తెరిచి, మంజులాదేవి ముందుంచాడు మాధవరావు. "ఇదుగో, ఇవి ఏడువారాల నగలు. మీ అక్క వేసుకునేది. ఇవి ఈ ఇంటి యజమానురాలు ధరించాలి. నీ కిష్టమైతే, వీట్ని పెట్టుకోవాలనుంటే తీసుకో. లేదా, రెండు నెలల్లో కోడలొస్తుంది కదా! ఆమె కిచ్చేద్దాం. నువ్వివి తీసుకుంటే, ఆమెకు వేరే నగలు చేయిద్దాం."

భర్త ఉద్దేశాన్నర్థం చేసుకుంది మంజులాదేవి.

బాగా ఆలోచించింది.

"నాకెందుకివన్నీ? కోడలుకే ఇచ్చేద్దాం. ఆమే కదా ఇంటికి కాబోయే యజమానురాలు. ఇందులో చాలా నగలున్నాయి. ఇంకా చేయించాల్సిన పని లేదు. ఇవి ఆమె కొరకే ఉంచుదాం" అంది మంజులాదేవి. అందులోంచి ఒక్క చంద్రహారాన్ని మాత్రం తీసి మెడలో వేసుకుంది.

రెన్నెల్ల తర్వాత సుధాకర్‌రావు పెళ్ళి వైభవోపేతంగానే జరిగింది. ఆ పెళ్ళిలో బంధువులన్న అవమానకరమైన మాటలన్నిటినీ భరించింది మంజులాదేవి.

తనకు అక్క వయసులో మాత్రమే ఉండి, తనకంటే అందంగా ఉన్న అత్తను చూసి ముఖం చిట్లించింది సుధాకర్‌రావు భార్య.

ఆమె ఉద్దేశాన్నర్థం చేసుకుంది మంజులాదేవి.

"అమ్మా నిర్మలా! నా వల్ల నీకే నష్టమూ కలుగదు. నీ అధికారాల కేభంగమూ కలుగదు. నువ్వేం భయం పెట్టుకోకు!" అంది.

మొదట 'అత్తమ్మా' అని పిలువడానికి సంకోచించిన నిర్మల, మెల్ల మెల్లగా అలా పిలువడానికి అలవాటు పడింది.

మాధవరావు ఊరుమ్మడి చెరువు నీళ్లను డబ్బు తీసుకొని పొరుగూరి వాళ్ళ కమ్మాడని, ఆ విషయంలో గొడవ జరిగిందని తెలుసుకుంది మంజులాదేవి.

ఓ రోజు భర్తతో అంది మెల్లగా, "మనకేం తక్కువుందో చెప్పండి? ఊరు సొమ్ము తినాల్సిన అవసరం మనకేమొచ్చింది? నలుగురు నాలుగు రకాలనుకుంటున్నారు."

అగ్గిమీద గుగ్గిలంలా లేచాడు మాధవరావు.

"ఆడముండలకు ఈ విషయాలన్నెందుకు? నువ్వు నాకు సలహాలిచ్చేదానివైనావా? నీ హద్దుల్లో నువ్వుండు. అయినా, పుట్టుకతో వచ్చిన లేకిడి బుద్ధు లేడపోతయి? 'కనకపు సింహాసనమున....' అన్నట్టుంది నీ సంగతి. నీకూరి విషయాలు చెప్పొద్దా దాసిముండే కదా. దాని సంగతి చెప్పొత". అని ఇష్టమున్నట్టు తిట్టి, కోపంగా లేచిపోయాడు మాధవరావు."

ఈ మాటలతో తన స్థానం స్పష్టమయింది మంజులాదేవికి. తాను కూచున్నదెంత గొప్ప కనకపు సింగాసనమో అర్థమైంది.

పెళ్ళయి రెండేండ్లయినా దాటకముందే మాధవరావు గుండె జబ్బుతో చనిపోయాడు. ఇరవై రెండేళ్ళయినా దాటకముందే విధవరాలయింది మంజులాదేవి. అతడు చనిపోయాడన్న దుఃఖం కంటే బంధువుల సానుభూతి వాక్యాలూ, సూదుల్తో పొడిచినట్టనే మాటలూ ఆమె నెక్కువగా బాధిస్తున్నాయి.

"రొండేండ్లన్న కాకపాయె - బిడ్డ ముండ మోసె."

"కడుపుల ఒక్క కాయ గాసినా మంచిగుండు. ఆమె బతుకు నాశినమాయె."

"ఇప్పుడామె కాస్తినేం చెందనిస్తరు? ఓ కొడుకుంటే హక్కుండు."

"ఏదో ఇంతిచ్చి ఎల్లగొట్టకుంటే ఇట్లుండ నిత్తడా సుధాకర్‌రావు దొర."

ఊరివాళ్ళనుకుంటున్న మాటలూ కొన్ని ఆమె చెవిన పడ్డాయి. కర్మ రోజున గాజులూ, బొట్టూ తీసెయ్యాలన్నారు.

రెండంటే రెండేండ్లు కాపురం పేరు మీద కలిసి బతికిన నేరానికి జీవితమంతా మోడులా... ఇక ఆలోచించలేకపోయింది మంజులాదేవి.

"స్త్రీకి గాజులు, బొట్టు భర్తతో లభించేవి కావు. భర్తపోతే వాట్ని తీసెయ్యాల్సిన అవసరమేముంది?"

మంజులాదేవి మేనబావన్న మాటలు విని, అందరూ అతని మీదికి లేచారు. అతని మాటల కంగీకారంగా తలూపిన మంజులాదేవిని తలోమాటన్నారు. 'దొరల కుటుంబంలో ఇలాంటి ఆలోచనే బరితెగించిన ఆలోచన'న్నారు.

ఈ విషయంపై నానా రభస జరిగింది.

"మన పూర్వులు ఏది పెట్టినా, ఆలోచించే పెట్టారు. భర్తతో పాటు సహగమనం తప్పంటారు కాని, అదేం తప్పుకాదు. భర్తే లేక పోయింతర్వాత భార్య ఎందుకోసం బతకడం?" అన్న పెద్ద మనుషులూ ఉన్నారు.

నర్సింగరావు, అతని భార్య గాజులు, బొట్టు తీయాలనే అన్నారు. మంజులాదేవిని గాజులు, బొట్టు తొలగించి విధవను చేసారు. ఆ దృశ్యాన్ని చూసి ఎంతోమంది కళ్ళనీళ్ళు తీసుకున్నారు.

మాధవరావు దొర కర్మ పెళ్ళంత వైభవంగా జరిగింది.

మాధవరావు చనిపోయి ఏడాది గడిచింది. ఇంటి అధికారాలన్నీ చేతుల్లోకి తీసుకున్నాడు సుధాకర్‌రావు. ఆ ఏడయిన పంచాయితీ ఎన్నికల్లో గెలిచి సర్పంచ య్యాడు. ఇంటధికారాలతో పాటు గ్రామాధికారాలనూ చేతిలోకి తీసుకున్నాడు. మాధవరావు బతికున్నప్పుడు మంజులాదేవి చేతుల్లో కొంతైనా డబ్బుండేది. తన తల్లిదండ్రులకు అప్పుడప్పుడు సాయం చేసేది. ఇప్పుడు ప్రతిదానికీ కొడుకునే అడగాల్సి వస్తుంది.

"అమ్మా! స్త్రీలకు డబ్బెందుకు చెప్పు? ఏ అవసరమున్నా తీర్చడానికి మేమున్నాం కదా! ఇంట్లో కూర్చొని హాయిగా తింటూ ఉండక మిగతా విషయాలు మీకెందుకు? చిన్న పిల్లలతో గడపడం అలవాటు చేసుకో."

మంజులాదేవిని తాతమ్మ స్థానంలో కూర్చొబెట్టాడు సుధాకర్‌రావు. ఇప్పుడాత డామెను 'అమ్మా' అని పిలుస్తున్నాడు.

"ఆస్తిలో నీకు సగం భాగమొస్తుంది, కేసు వేద్దాం. నువ్వెందుకా ఇంట్లో సేవలు చేస్తూ బతకాలి?" అన్నాడు మంజులాదేవి అన్నయ్య. మరో అన్నయ్యా తండ్రీ ఆ మాటలనే సమర్థించారు.

వాళ్ళందర్నీ ఇష్టమున్నట్టు తిట్టింది మంజులాదేవి.

"నేను పెద్ద దొరసాని నవుతానని పెండ్లి చేసారు కదా! అయ్యాను కదా! పెద్ద దొర్సానిని, జమీందారు భార్య నవుతున్నానని మురిసిపోయారు కదా! అప్పుడెటుపోయింది మీ బుద్ధి? అతని వయసెంతో మీకు తెలియదా? ధనం, అధికార మదంతో ఉండే దొరలకుండే రోగాలేంటో మీకు తెలియవా? తెలిసినా ఈ దురుద్దేశాన్ని మనసులో పెట్టుకొనే ఈ పెండ్లి చేశారా? స్త్రీ చూడాల్సింది

ఆస్తిపాస్తులనే కాని, మనిషిని కాదని ఆ రోజే చెప్పారు కదా మీరు? ఇప్పుడు నాకు కావాల్సింది బట్ట, తిండి, వసతికి కరువేం లేదు. మరెందుకు నన్ను కేసు పెట్టమంటున్నారు?"

"అది కాదమ్మా? అన్ని ఆస్తిపాస్తులున్నా నీ చేతిలో ఏమున్నట్టయింది? నువ్వెన్నాళ్ళని ఇలా మోడులా బతుకుతావు?" అన్నాడు నర్సింగరావు.

"నా చేతిలో ఏమన్నా ఉంటే ఎలా బతికినా ఫర్వాలేదంటారు! నూరేళ్ళు పసుపు కుంకుమలతో బతుకుతాననే నాకీ పెళ్ళి చేశారా? ఈ బుద్ధి మొదలెక్కడ పోయింది? అందరు దొరల కుటుంబంలోని స్త్రీలాగే నా పరిస్థితి ఉంది. నా గురించి మీరు జాలి పడాల్సిందేం లేదు. మంచికో, చెడుకో జరిగిందేదో జరిగిపోయింది. నేనిప్పుడా కుటుంబములో ఒకర్తెను. నాకు నలుగురు కూతుర్లు, ఓ కొడుకున్నాడు. కొడుక్కు పిల్లలవుతూన్నరు. నేనెట్టి పరిస్థితిలోను ఆస్తి కోసం కేసు వేయను. మరో పెళ్ళి చేసుకోవడమూ జరుగదు. నా జీవితమూ కుటుంబంతోనే ముడిపడింది."

మరెప్పుడూ ఆమెతో ఆ ప్రస్తావన తేలేదామె తల్లిదండ్రులు. మరో నాలుగైదేళ్ళలో సూధాకర్‌రావు చెల్లెండ్ల పెళ్ళిళ్లయి పోయాయి. సుధాకర్‌రావు పిల్లలనే తన పిల్లలుగా చూసుకుంటూ, ఆ కుటుంబంలో ఒక్కతై బతుకుతుంది మంజులాదేవి.

మరికొన్నేళ్ళు గడిచాయి. నైజాం పాలనపోయి పాతికేళ్ళకు పైన్నే అయింది. అయినా దొరల అధికారాలు నిర్విఘ్నంగానే సాగుతున్నాయి. 'అయ్య బాంచెను', 'అవ్వ బాంచెను' సంస్కృతి విచ్చలవిడిగా నడుస్తుంది. తండ్రి బాటలోనే ఊర్నేలుతున్నాడు సుధాకర్‌రావు.

ఊళ్ళో పోరాటాలు అప్పుడప్పుడే ప్రారంభమవుతున్నాయి. పాలేర్ల జీతాల పెంపుతో ప్రారంభమైన ఉద్యమాలు, మరింత ఉధృతమయ్యాయి. 'నీ కాల్మొక్త, నీ గులాపోన్ని' అని బతికిన జనాలే వీరకిశోరాలై తిరుగబడుతున్నారు. దొరల అధికారాలను ప్రశ్నిస్తున్నారు. సుధాకర్‌రావు వాళ్ళపై ఘోరంగా మండిపడుతున్నాడు. వెట్టి, పల్లకీ మోత, బండిముందు చాకలి పరుగెత్తడం లాంటివి బందయ్యాయి.

ఓ రోజు సుధాకర్ రావు నెదురుగా కూర్చోబెట్టుకొని అంది మంజులాదేవి: "పరిస్థితులను చూస్తుంటే మునుపట్లా కనబడటం లేదు. కాలంతో పాటు మనమూ మారాలి. జనంతో ఘర్షణ వైఖరెందుకు మనకు? మనకేం తక్కువయిందని ఇంకా సంపాదించాలనుకోవడం?"

నిర్మల కూడా మంజులాదేవినే సమర్థించింది.

తండ్రిలాగే అగ్రహోన్ని వెళ్ళగక్కాడు సుధాకర్‌రావు.

"మీ సలహాలు నాకేమక్కర్లేదు. ఎవ్వన్నెక్కడుంచాలో, ఎప్పుడేం చేయాలో, నాకు బాగా తెలుసు. ఈ అలగాజనంతోనేం కాదు. సంఘాలని మురుస్తుండ్రు. వాపును చూసి బలుపనుకుంటండ్రు" అని ఎగిరాడు.

వాళ్ళ మాటలకేమాత్రమూ విలువివ్వలేదు.

ఫలానా గ్రామంలో దొరపై దాడి అన్న వార్తలు వింటూ నిర్మలా, మంజులాదేవి

గజగజ వణికిపోయారు. అయితే, తామేం చెప్పినా వినిపించుకోడని చేసేదేంలేక దైవంపై భారంవేసి ఉండేవారు.

అయితే, సుధాకర్‌రావు గ్రామాల్లో పోరాటాలు అరంభం కాగానే ఆస్తులు కొద్దికొద్దిగా అమ్ముతూ, జిల్లా కేంద్రంలో ఆస్తులు పెంచుతున్నాడు.

ఊళ్ళో యువకులిప్పుడు తమ కార్యక్రమాల్లో భాగంగా మంజులాదేవి విషయాన్ని ముందుకు తెచ్చారు. ఆమె బయటకు రావడానికి సిద్ధంగాలేదు కాబట్టి, సుధాకర్‌రావు కచ్చేరింట్లోనే పంచాయతీ ఏర్పాటు చేశాడు.

"మీకెవరు ఫిర్యాదు చేసారు? ఈ పంచాయితీ లెందుకు?" అన్నాడు సుధాకర్‌రావు యువకుల నుద్దేశించి.

"మాకు ఎవరూ ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. మంజులాదేవికి ఘోరమైన అన్యాయం జరిగింది. ఆమె జీవితం నాశనమైంది. ఆమెకు న్యాయం జరగాలి" అన్నాడో యువకుడు.

ముప్పయ్యేళ్ళ క్రితం తన పెళ్ళయి నప్పుడు కూడా పట్టని యువకులు, తనకు న్యాయం చేస్తాననడం మంజులాదేవి కాశ్చర్యకరంగా ఉంది.

ఆమేం మాట్లాడలేదు.

"అమ్మా! మీరు 'ఊ' అనండి. మీకు సగం ఆస్తి ఇప్పిస్తాం. సగం ఆస్తి మీకెలా రాదో మేం చూస్తాం."

ఆ మాటలకామె విరక్తిగా నవ్వింది.

"నాకిప్పుడు ఆస్తెందుకు? దాన్నేం చేసుకోవాలి? ఏభైఏళ్ళ వయసులో ఆ ఆస్తిని మూటగట్టుకొని పోవాలా? అయినా, నాకాస్తి కావాలని మీతో చెప్పానా?" అంది.

"మీరు చెప్పాల్సిన అవసరం లేదు. మాధవరావు భార్యగా మీకు అతని ఆస్తిలో సగభాగం వస్తుంది. మీకాస్తి అవసరం లేకుంటే మీ తల్లి తరుపువాళ్ళు పేదవాళ్ళు కదా? వాళ్ళకివ్వండి."

"నేనెప్పుడైతే ఈ కుటుంబంలో అడుగుపెట్టానో, వీళ్ళలో ఒకదాన్నయిపోయాను. నా పేగు తెంచుకొని పుట్టకపోయినా, దొర పిల్లల్నే నా పిల్లలనుకున్నాను. సుఖాలే అనుభవించానో, కష్టాలే అనుభవించానో - నోట్లోమాట బయట పడకుండా బతికాను. కుటుంబ గౌరవం కాపాడటానికే ప్రయత్నించాను. ముప్పైఏళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు మీరు నన్ను ఈ కుటుంబం నుంచి వేరుచేసి ఆస్తికోసం వెంపర్లాడమంటారా? నా కొడుకులాంటి సుధాకర్‌రావే తాతయ్యాడు. ఇప్పుడీ ఆస్తి తగాదాలన్నెందుకో చెప్పండి. మంచో చెడో నేనోరకమైన జీవితాని కలవాటుపడ్డాను. దయచేసి నా విషయంలో మీరేం జోక్యం చేసుకోకండి. నేను కష్టపడుతున్నానని మీకు ఫిర్యాదు చేసినప్పుడు తీర్పివ్వండి" అంది మంజులాదేవి.

వాళ్ళేదో మాట్లాడబోతే మాట్లాడనివ్వలేదు మంజులాదేవి.

"దొరల కుటుంబాల్లో పురుషులు దొరతనం అహంకారంతోనే బతుకు తారు. కాని, చాలామంది స్త్రీలు దాదాపు బానిసల్లాగే బతుకుతారు. వాళ్లకంటూ వ్యక్తిత్వం

ఉండటం దొరలు సహించరు. సరే! మీరు పంజరాల్లోని చిలుకల్లాగే బతుకుతానంటే మేం చేసేదేముంది. ఆ పంజరం బంగారందైతే కావచ్చు. కానది పంజరమేనన్న విషయం మరిచిపోవద్దు. మీరెలా బతుకుతున్నారో మీకే తెలియదు. అడవిగాచిన వెన్నెలయిన మీ బతుక్కు న్యాయం చేస్తామంటే మీరొప్పుకోవడం లేదు. నూతిల్లోని కప్పల్లాగే బతకండి" అని యువకులు వెళ్ళిపోయారు. వాళ్ళమాటలు గూర్చి చాలా రోజులు ఆలోచించింది మంజులాదేవి. ఊళ్ళో పోరాటాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఊళ్ళోని చాలా ఆస్తులను అమ్మి, పట్నంలో ఆస్తులు పెంచాడు సుధాకర్‌రావు. పట్నంలో రెండిండ్లు కట్టాడు. అయితే ఊళ్ళోనే యువకులతో ఘర్షణ వైఖరి నవలంబించి పోలీసు క్యాంపు పెట్టించాడు సుధాకర్‌రావు. పోలీసు క్యాంపు ఎత్తేసింతర్వాత, ఇక ఆ ఊళ్ళో ఉండటం సాధ్యం కాలేదతనికి.

పట్టణానికి మకాం మార్చాడు.

మరికొన్నేండ్లు గడిచాయి. తనలాంటివాళ్ళ జీవితాల్లో పెద్దగా మార్పు లేకపోవడం గమనించింది మంజులాదేవి.

సుధాకర్‌రావు మనుమరాలు సంధ్య డిగ్రీ చేస్తుంది. ఆమె స్త్రీవాద ఉద్యమాల్లో, మద్యపాన వ్యతిరేక ఉద్యమాల్లో తిరుగుతుంది.

ఆ ఉద్యమాల్లో ఆమె చురుకైన పాత్రనే పోషిస్తుంది.

సుధాకర్‌రావుకవి నచ్చడం లేదు. మనుమరాలి కెన్నిసార్లు చెప్పినా వినడం లేదు.

"అమ్మా సంధ్యా! అలాంటివన్నీ మనలాంటి దొరల కుటుంబాల నుంచి వచ్చిన స్త్రీలు పాల్గొనేవి కావు. అలగా జనం, బజారు స్త్రీలు తిరిగేవాటితో నీకేం పని?"

తాతయ్య మాటలను తీవ్రంగా ఖండించింది సంధ్య.

తన వాదంతో అతని అభిప్రాయాలను తుత్తినియలు చేసింది.

"అమ్మా! నీ మాటంటే గురి సంధ్యకు. నువ్వైనా చెప్పి చూడమ్మా! ఆమెను మార్చే బాధ్యత నీది."

మంజులాదేవిపై భారాన్ని మోపారు సుధాకర్‌రావు, అతని కొడుకు.

మనుమరాలిని దగ్గర కూర్చోబెట్టుకొని అనునయంగా అంది మంజులాదేవి: "సంధ్యా! మనది మొదట్నుంచీ దొరల కుటుంబం. నీలాంటిదాని కివన్నీ ఎందుకు చెప్పు? నీకేం తక్కువైందని? మీ నాన్నకు, తాతయ్యకు మనక్షోభ కలిగిస్తూ, అందులో తిరగకపోతే ఏంబోతుంది?"

ముగ్గుబుట్టలా ఉన్న మంజులాదేవి తలలో చేతులు పెట్టి నిమిరింది సంధ్య. ముద్దు పెట్టుకుంది.

"నానమ్మా! నువ్వు నాకు ముత్తవ్వవయితావు. అయినా, నిన్ను నానమ్మనే పిలుస్తున్నాను. మా నానమ్మెలాగూ కాలం చేసింది? ఒక్కసారి నీ బతుకును జ్ఞాపకం చేసుకో నానమ్మా! మా తాతయ్య వయసులోనే ఉన్న నువ్వు ముత్తవ్వెందుకయ్యావు? నానమ్మా! దొరసానులుగా మీరు బతికిన బతుకులను

మననం చేసుకో. మన కుటుంబాల్లో ఆడవాళ్ళబతుకులు దొరలకు 'సాను'లుగా కంటే, ఏమన్న భిన్నంగా ఉన్నాయా? తిండికి, గుడ్డకు ఏం లోటు లేకుండా, సాగడం తప్ప మన స్త్రీల బతుకులకు ప్రత్యేకమైన వ్యక్తిత్వమంటూ ఏమైనా ఉందా? మీరు బతికిన బతుకులు బంగారు పంజరంలోని చిలుక బతుకుల్లాంటివి.

"నానమ్మా! స్త్రీకిగాని, పురుషుడికిగాని ఎంత విలువైనదైనా పంజరం బతుకే బతుకంటావా? బయటెంతో ప్రపంచముంది. ఆ ప్రపంచంలో ఎంతో సౌందర్యముంది. ఎంతో వేదనుంది. ఎన్నో సమస్యలున్నాయి. ఇవన్నిటినీ గూర్చి మీకు తెలిసే అవకాశం లేదు. తెలిసినా మీరేం చేయలేరు.

"నానమ్మా! ఆస్తి పాస్తులున్నా, ఇంకేమున్నా మీలాగా పంజరంలోని చిలుకలా బతకడం నాకిష్టం లేదు. మన కుటుంబాల్లోని స్త్రీల బతుకులెంత పరాధీనమైనవో, మీరెంత జీవితాన్ని కోల్పోయారో నీ జీవితాన్ని మననం చేసుకుంటే నీ కర్థమవుతుంది. నేనేం తప్పు చేయడం లేదు. కాని పనులు చేయడం లేదు. నాకు మంచనిపించిన విషయాలకు మద్దతిస్తున్నాను. ఇవే తాతయ్యకూ, నాన్నకూ పరువుతక్కువ పనులుగా కనిపిస్తే నేనేం చేసేది లేదు. నన్ను కట్టిపడెయ్యాలని చూస్తే అందువల్ల ప్రయోజనం శూన్యం" అంది సంధ్య.

"మీరు బతికిన పంజరం బతుకు నా కవసరంలేదు. అవసరంలేదు." మనవరాలి మాటలే మంజులాదేవి చెవుల్లో గింగురుమంటున్నాయి.

"నానమ్మా! ఏదో బాగా ఆలోచిస్తున్నట్టున్నావు. నేను ఉదయం నీతో అన్న మాటలు నిన్ను ఫ్లాష్‌బ్యాక్‌లోకి లాక్కెళ్ళినట్టున్నాయి. అరుపదులు దాటిన నీ జీవితాన్ని సాక్షాత్కరింపజేసు కున్నా వనుకుంటాను.యామ్ ఐ రైట్?" అంటూ మంజులాదేవిని కౌగిలించుకొని, ఆమె ప్రక్కనే కూర్చుంది సంధ్య.

సుధ చెల్లెలు పెంచుకున్న చిలుక పంజరంలోంచి 'సంధ్య...సంధ్య'అని చిలుక పలుకులు పలుకుతుంది.

ఆ చిలుకదిక్కోసారి చూసింది మంజులాదేవి.

తేలికైన హృదయంతో మనవరాలిని మనస్ఫూర్తిగా ఎదకు హత్తుకుంది మంజులాదేవి.

● *ప్రజాసాహితి, సెప్టెంబర్, 1997* ●

★ ★ ★